# మురికి

అది పట్టణం నడిబొడ్డులో వున్న ఖరీదైన బంగ్లా... ఆ బంగ్లాలో గ్రాండ్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, కేరమ్స్, పేకలాంటి ఖరీదైన ఆటలాడుకునే సౌకర్యాలున్నాయి. రోజా సాయంత్రాల్లో ఆ బంగ్లా పట్టు చీరల పరపరలతో, బంగారు నగల మిలమిలలతో కళకళలాడుతూ కనబడుతుంది... ఆ పట్టణంలో ఖరీదైన ఉద్యోగాలు చేసే పురుషుల సతీమణులు, బాగా డబ్బుతో కొవ్వెక్కిన వాళ్ళ భార్యలు, కొందరు ఉద్యోగాలు చేసే స్త్రీలు అక్కడికొస్తుంటారు... వాళ్ళ ముఖాలు ఇంచుమందంతో పట్టించిన పౌడర్... పెదవులు లిప్‌స్టిక్.... చెక్కిల్లు ఎండ కన్నెరుగని నునుపుదనంతో మెరిసిపోతుంటాయి. వాళ్ళంతా చదువుకున్న నాగరికులు మాత్రమేకాదు, నవనాగరికులు కూడా. .. రోజా సాయంత్రాల్లో ఆనందంగా సమయం గడపడానికా స్త్రీలక్కడి కొస్తుంటారు. చర్చోపచర్చలు చేస్తుంటారు... వాదోపవాదాలు, విమర్శలు చేస్తుంటారు... ఆటలాడుకుంటారు. పాటలు పాడుకుంటారు... ఆనందంగా నవ్వు కుంటారు... రకరకాలుగా సమయాన్ని గడుపుతుంటారు... వాళ్ళకక్కడ సమయమే తెలియదు. గంటలకు గంటలు అవలీలగా దొర్లిపోతుంటాయి. పిల్లలు గుర్తురారు... భర్తలు గుర్తురారు... తమ గృహకృత్యాలు గుర్తురావు... అది ఆ పట్టణంలోని ఖరీదైన బ్రతుకులు బ్రతికే స్త్రీల రిక్రియేషన్ క్లబ్ .....

రోజూలాగే ఆ రోజుకూడా సాయంత్రం ఆ బంగళా స్త్రీలతో కళకళలాడుతూ ఉంది. కొందరు పేకాడుతున్నారు... కొందరు క్యారమాడుతున్నారు. కొందరు టెన్నిసాడుతున్నారు. కొందరు స్త్రీలు అక్కడక్కడ గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. జోకు లేసుకుంటున్నారు. నవ్వు కుంటున్నారు.

"నీ చీర బాగుంది ఎంతక్కొన్నావు వదినా..?" అడిగిందో ఇంజనీర్ గారి భార్య, డాక్టర్ గారి భార్యను.

"మావారు బెంగుళూరు టూరు కెళ్ళినప్పుడు తెచ్చారు. పదిహేను వందలయింది. నాకు వెయ్యి రూపాయలకంటె తక్కువ ఖరీదు చీర లేనేలేదు" అంది డాక్టర్ గారి భార్య....

'దీని బడాయి... దీని సంగతి నాకు తెలియదనుకుంటుందేమో'... తనలో తానే అనుకొని "అవును వదినా, నాకూ చీపు క్వాలిటీ చీరలు కట్టాలంటే చికాకనిపిస్తుంది... నాకువున్న చీరల్లో అతి తక్కువ ఖరీదు చీర పదకొండు వందల్ది..." అంది ఇంజనీర్ భార్య, డాక్టర్ భార్య చీరకొంగు కొసకు వేలాడుతున్న

800/- అని రాసున్న కాగితాన్ని చూసి ముసి ముసిగా నవ్వుతూ... ఆ నవ్వులోని అంతరార్థాన్నర్థం చేసుకుంది డాక్టర్ భార్య....

"కంట్రాక్టర్ల నుంచి లంచాలు గుంజి ఎన్ని వందల రూపాయల చీరలైనా కొనొచ్చు, దాందేముంది?" చురుకంటించింది.

"హాస్పిటల్ మందు లమ్ముకున్నా కొనుక్కోవచ్చనుకుంటాను..." మాటకు మాటందించింది ఇంజనీర్ భార్య...

"ఆఁ...మా వార్నంత మాటంటావా...? నీ సంగతి నాకు తెలవంది కాదు..."

"మా వార్నంటె నేనూర్కోవాలా...? నీ సంగతీ నాకూ తెలుసు..."

ఇలా ఒకరిపై కొకరు లేవబోతుంటే అక్కడున్న మిగతా వాళ్ళాపారు...

మూతి ముడుచుకొని ఇంజనీర్ గారి భార్య అక్కన్నుంచి లేచి పోయింది. మిగతావాళ్ళు మళ్ళీ మాటల్లో పడ్డారు...

"మీరు కారు కొంటున్నారటగా వదినా? ఏం కారు?" అనడిగింది డాక్టర్ భార్య విమలను... విమల డిప్యూటీ తహసీల్దార్ గారి సతీమణి...

"స్కూటర్ మీద కూచోవటం... బోరవుతుంది... బయట ఎండ దుమ్ము... ధూళి...ఆఫీసు జీబులో పోవాలంటే నాకు తలనొప్పి. అందుకే బలవంతం చేసి ఒప్పించాను మావార్ని... బహుశా మారుతీకారు కొంటారేమో... ఇప్పుడదే బాగా నడుస్తుంది..." అంది విమల.

"మా కంబాసిడర్ కారుంది...పిల్ల లెదిగారు... ఒక్క కారు సరిపోవడం లేదు... మరొకటి కొనమన్నాను మావార్ని..." అంది డాక్టర్ భార్య.

వారి సంభాషణ ఖరీదైన వస్తువుల గురించి ఖరీదు ఖరీదుగా సాగిపోతూనే వుంది. మరో చోట పేకాటాడుతూ మాట్లాడు కుంటున్నారు.

"ఈ ముసలోల్లతోనే పెద్ద న్యూసెన్సు వదినా..." అంది కమ్మ విడుస్తూ సరళ.. ఆమె పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారి భార్య.

"ఎవర్ని గురించి వదినా, నువ్వు చెబుతుంది"... అందో లాయర్ భార్య రేఖ...

"మా అత్తమామల గురించే వదినా! అవసరమైతే వాళ్ళకు నెల కింత డబ్బు పారెయ్యండి కాని, వాళ్ళిక్కడికి రావద్దన్నాను, మా వారితోనే... మా వారసలే వినిపించుకోరు. ఆ పల్లెటూర్నుంచొస్తారు, అంతా మురికి మురికి...వీళ్ళతో పిల్లలకు దురలవాట్లొస్తాయి..." అంది సరళ ముసలివాళ్ళంటే అదోలా ముఖంపెట్టి...

"అవును వదినా! ముసలి వాళ్ళయినంక వాళ్ళను వృద్ధుల రక్షణా శిబిరాలకి పంపిస్తే సరిపోతుంది. మనకు తలనొప్పి పోతుంది..." అంది మరో స్త్రీ...

"బాగా చెప్పావు వదినా...! కాని, మనదేశంలో అవెక్కడేడ్చాయి....పెద్ద పెద్ద సిటీల్లో ఉంటే ఉండొచ్చు. ఈ ముసలాల్లు వచ్చి ఒక్కటి రెండు రోజులున్నా ఉండిపోరు. తిష్ట వేస్తే ఎవరరుసుకోవాలి..." అంది సరళ...

అప్పుడే అక్కడికొచ్చి వాళ్ళ మాటలు విన్న రాజేశ్వరి–

"మనమెప్పుడు ఇలాగే వుంటాం. మనకు ముసలితనమసలే రాదు. ...కదా వదినమ్మలూ..." వ్యంగ్యంగా అనుకుంటూ అక్కన్నుంచి వెళ్ళిపోయింది.

"ఉద్యోగం చేస్తూ స్వయంగా సంపాదిస్తున్నానన్న టెక్కు దీనికి... దీని జీత మనంగ మావారిచ్చే టైపిస్టు జీతంగాదు..." అంది రేఖ...

"దాని మాటలకేంలే రేఖా! దాని సంగతి తెలియందెవరికి? అదెప్పుడూ అలాగే పుల్ల విరుపు మాటలంటుంటుంది..." అది సరళ...

వాళ్ల సంభాషణల్లో నానా విషయాలు దొర్లుతున్నాయి. అమెరికా ప్రెసిడెంటు నుంచి మొదల్కొని అమాలోని వరకు అందులో పాత్ర ధారులవుతున్నారు... మరో చోట క్యారమాడుకుంటూ స్త్రీల హక్కుల గూర్చి చర్చించుకుంటున్నారు. స్త్రీల పరిస్థితి గూర్చి ఆవేశంగా మాట్లాడుకుంటున్నారు. మగవాని దౌర్జన్యం గూర్చి చెప్పుకుంటున్నారు.

ఆ మహిళామణు లందరికీ తలలో నాల్కలా మెదుల్తూ తిరుగుతున్నాడు రూమ్ బాయ్ ఆనంద్... వాళ్ళ మాటలు వింటూ తనలో తాను నవ్వుకుంటూ వాళ్ళడిగిన టీలు, కాఫీలు, కూల్ డ్రింకు లందిస్తూ ఆ బంగళా అంతా తానే అయి తిరుగుతున్నా డానంద్... స్త్రీల పరిస్థితి గూర్చి మాట్లాడుకుంటున్న వాళ్ళదగ్గరి కొచ్చాడానంద్... వినయంగా నిల్చున్నాడు....

"అమ్మగారూ! బయట బిచ్చపుది మొత్తుకుంటుంది.... ఒక్క రూపాయుంటె ఇవ్వండి... ప్రొద్దుట్నుండి అన్నం తినలేదట... చంకలో చంటి పిల్లవాడు కూడా ఉన్నాడు..." అన్నాడు.

"ఏంటీ వెధవ వాగుడు... పో... ముసల్దాన్ని పొమ్మను... ఇక్కడకూడా బిచ్చగాళ్ళ గోల తప్పదా..." అని కసురుకుందొకామె...

"ఒక్క రూపాయనగా ఎంత మేడమ్...? ఒక్క టీ విలువ కాదు... పాపం ముసల్ది మొత్తుకుంటుంది..." అన్నాడానంద్...

"నువ్వు మాకు పాఠాలు చెప్పక్కర్లేదు... దానికిచ్చే రూపాయి ఒక్క టే విలువకాదు. మేం ఒక్కసారేసుకునే పౌడర్ విలువ చెయ్యదని మాకు తెలుసు... నువ్వెళ్ళి ముసల్దాన్నవుతలకుగెంటెయ్యి..." కోపంగా అంది మరో మహిళ...

'ఇదీ మీరు చేసే స్త్రీ జనోద్ధరణ...' తనలో తానే అనుకుంటూ ముసలి బిచ్చకత్తెను పంపించడానికి వెళ్ళాడు ఆనంద్...

వాళ్ళు సంభాషణ మళ్ళీ కొనసాగిస్తున్నారు...

"మీకీ విషయం తెలుసా...?" అంది లక్ష్మమ్మ - కాంట్రాక్టర్ భార్య...

"ఏ విషయమో చెప్పందే ఎలా తెలుస్తుంది...?" అంది వేరొకామె...

"ఆ లెక్చరర్ గారి భార్యలేదూ...? రమాదేవి... పులింజూసి నక్కవాత పెట్టుకున్నట్లు మనల్ని చూసి అన్ని షాపుల్నుంచి ఇన్‌స్టాల్‌మెంట్లకని ఫర్నీచర్ తెచ్చింది. ఆ బోడుద్యోగంతో నెలకు పదిహేనువందల రూపాయ లేన్నుంచి కడతాడా అర్భకుడు... ఇన్‌స్టాల్‌మెంట్లు సరిగా పే చెయ్యకపోతే షాపుల వాళ్ళొచ్చి ఎవరి

సామాన్లు వాళ్ళు తీసుకెళ్ళారు. లేని పెద్దరికానికి పోతే ఇలాగే అవుతుంది..." అని నవ్వింది లక్ష్మమ్మ... ఆమె మాటలు విని అంతా ఫక్కున నవ్వారు...

మరోచోట కుర్చీలో తీరికగా కూచొని పకపకలు వికవికలతో సంభాషణ సాగిస్తున్నారు ఐదారుగురు స్త్రీలు...

"మీకీ సంగతి తెలియదనుకుంటాను..." అని అటూ ఇటూ అన్ని ప్రక్కలకు చూసి... "లత లేదూ...? కలెక్టరు గారి పి.వి. భార్య... దానికి ఆర్టిస్ట్ ఉదయ్‌తో అక్రమ సంబంధముంది... నేనోసారి వాళ్ళింటికెళ్ళే సరికి ముందు గదిలో కూచొని ఇద్దరు ఒకటే విక వికలు పక పకలు... నాకు చిర్రున మండుకొచ్చింది...". అంది కోమలి.

"లత భర్త, ఉదయ్ మంచి స్నేహితులనుకుంటాను... స్నేహితునికే ద్రోహం చేస్తాడంటావా ఉదయ్..." అంది సరోజ...

"అలాంటి వాళ్ళనే నమ్మకూడదు వదినా...! నా కళ్ళతో నేనే చూసాను... వాళ్ళ కా దురుద్దేశ్యం లేకుంటే లత భర్త లేనప్పుడు వాళ్ళింటి కెందుకెళ్ళాలి.... వెళ్ళినా అలా తీరిగ్గా కూచొని వికవికలు పకపకలెందుకు...? నువ్వందర్నీ నమ్ముతావు వదినా..." అది కోమలి...

"అవును వదినా! ఏ పుట్టలో ఏ పాముందో... పైకెంతో సంసార్లలాగానే కనిపిస్తారు... చేసే పనులేమొ ఇలా వుంటాయి... ఛీ ఛీ... నాకిలాంటి వాళ్ళంటే అసహ్యం...." అని ముఖం చిట్లించింది. సరోజ...

"ఆ టక్కులాడి రాజ్యం లేదూ? మునిగాళ్ళమీదనే నడుస్తుంది... తానే పెద్ద అందగత్తె ననుకుంటుంది... తోలు ఎర్రగా వుంది కాని దాని ముఖం కోతి ముఖమే..."

"ఆ రచయిత మిసెస్ రజని లేదూ! దాని భర్త... నవలలు రాస్తాడని దానికి పెద్ద నీలుగుడు... ఆయనగారి నవలలు చదువాలంటే తలనొప్పి మాత్రలు పక్కనుంచుకోవాలి... పరమచెత్త..."

వాళ్ళ మాటల్లో ఎంతోమంది స్త్రీల మానాలు బుగ్గిపాలవుతున్నాయి. వాళ్ళ సంభాషణలా సాగిపోతూనేవుంది. ఇంతలో ఆనంద్ వాళ్ళ దగ్గరికొచ్చాడు.

"మేడమ్! మీకు ఫోనొచ్చింది... మీ పాప బాగా ఏడుస్తుందట... ఎంత ఊకుంచినా ఊర్కోవడం లేదట... త్వరగా రమ్మని మీ పని మనిషి ఫోన్చేసింది..." అన్నాడు సూపరింటెండెంటుగారి భార్య సుజాతతో...

"డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళమని చెప్పు..." కసిరినట్టందామె...

బిక్క మొహం వేసుకొని వెళ్ళిపోయాడానంద్...

"ఎంజాయ్ చెయ్యకుండా ఈ పిల్లలతోనో తలనొప్పి... నాకు పిల్లల్ని కనడం ఇష్టం లేదు... కనీసం పదేళ్ళయినా ఉందామనుంది..." అంది రెండేళ్ళ క్రితమే ఓ యువ ఇంజనీర్ను పెళ్ళాడిన యువతి...

"నాకూ అంతే. నేనబార్షన్ చేయించుకుంటానంటే మావారిస్లేదు... ఇక తప్పలేదు. ఐదేళ్ళలో ఇద్దరు పిల్లలయ్యారు... వాళ్ళతో వేగలేక చస్తున్నా..." అంది సుజాత.

"మా పనిమనిషుంది లక్ష్మని... దాన్ని చూస్తేనే అసహ్యం నాకు... కాని కష్టపడి పన్జేసేదాన్ని వదులుకుంటే పనిమనుషులు దొరకరని ఉంచుతున్నా... చంకలో వేలాడుతూ చీమిడి ముక్కుతో అదేపని చేస్తున్నా పాలు తాగుతూనే వుంటాడు పోరడు... డర్టీ రోగ్స్..." అంది కోమలి.

"అమ్మబాబోయ్, నాకు పిల్లలకు పాలివ్వడమంటే అసహ్యమనిపిస్తుంటుంది. అందరి ముందు సిగ్గులేక పాలెలా ఇస్తారో నాకర్థంకాదు. అందుకే మా ఇద్దరు పిల్లలకూ చిన్నప్పట్నుంటే డబ్బా పాలు పట్టాను..." అంది సుజాత తానేదో గొప్ప పని చేసినట్టు...

అందరూ ఆటలాడటం ముగించి బిల్డింగ్ బయటున్న ఖాళీ ప్రదేశంలో కుర్చీలు వేయించుకుని కూర్చున్నారు. ఇప్పుడు వాళ్ళ సంభాషణ అక్కడ లేనివాళ్ళమీదికి మళ్లింది. అక్కడ లేనివాళ్ళ గూర్చి రకరకాలుగా అంటున్నారు... ఆనంద్ ఈ మాటలన్నీ రోజూ వింటున్నవే... ఈ రోజున్న వాళ్ళగురించి కూడా వాళ్ళు లేనప్పుడు ఈ మాటలే ఎన్నోసార్లు అతడు విన్నవే... బట్టకట్టడం గురించి, అలంకరణ గురించి – చివరకు శీలం గురించి కూడా ఘోరంగా మాట్లాడుకుంటున్నారు. రాత్రి తొమ్మిది గంటలయింది. అయినా వాళ్ళ మాటలు కొనసాగుతూనే వున్నాయి. నవ్వులతో కేరింతలతో ఆ ప్రదేశం ప్రతిధ్వనిస్తుంది.

ఖరీదైన బట్టలతో, ఖరీదైన అలంకరణతో పైకి అందంగా ఆకర్షణీయంగా కనబడే ఆ మహిళామణుల కంపుగొట్టే మాటలు వినలేకపోతున్నాడానంద్...

"అమ్మా! మురికి... మురికి... గబ్బు... గబ్బు... కంపు వాసనొస్తుంది..." అని ముక్కు మూసుకొని వాళ్ళదగ్గరికొచ్చాడానంద్...

వాళ్ళమాటలాగిపోయాయి...

అంతా ఆనంద్ దిక్కే చూస్తున్నారు...

"రాస్కెల్... ఎవరి దగ్గర్రా మురికి వాసన...? తలకాయ తిరుగుతుందా?" కసిరినట్టంది రిక్రియేషన్ క్లబ్ సెక్రటరీ...

"ఇంకెవరి దగ్గర్నుంచి, మన దగ్గర్నుంచే...? మన మాటలు, ప్రవర్తన, పనులు భరించరాని దుర్గంధం వేస్తున్నా యంటున్నాడు ఆనంద్... ఇది నిజం కాదా ఆనంద్...?" అంది రాజేశ్వరి ఆనంద్ ముఖం చూస్తూ...

'ఎంత చక్కని మాటన్నారమ్మగారూ...! కాని, నేనీమాటంటే ఈ ఉద్యోగం పోతుంది...' అని తనలో తానే అనుకొని–

"గోడ ప్రక్కనున్న మురికి కాలువ నుంచి చెడ్డవాసన నొస్తుందమ్మగారూ! కాలువలో చెత్తా చెదారం చిక్కుకొని కుళ్ళిపోయి వాసనొస్తుంది..." అన్నాడు ఆనంద్ అమాయకంగా ముఖంపెట్టి...

"అయితే మమ్మల్నేం చెయ్యమంటావు...? మునిసిపాలిటీ వాళ్ళొచ్చినప్పుడు వాళ్ళతో తీయించు... లేదా నువ్వే తీసి పారెయ్యి... మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకు... పొయ్యి కాలువ శుభ్రం చెయ్..." అంది ప్రెసిడెంట్ ప్రేమానందదేవి.

వాళ్ళెంత సెంట్లు పౌడర్లు రుద్దుకున్నా, ఎంత నవీనంగా అలంకరించుకున్నా వాళ్ళ మాటల్లోని దుర్గంధం ముందు ఆ మురికి కాలువలోని దుర్వాసన ఏమాత్రం పోటీ పడటంలేదు...

'మీ మాటలు వినేకంటే ఆ కాలువలోని మురికిని శుభ్రం చేయడమే మంచిది...' అని తనలో తానే అనుకుంటూ "అలాగే అమ్మగారూ... కాలువను శుభ్రం చేస్తా..." అని అంటూ అక్కన్నుంచి వెళ్ళిపోయాడానంద్...

● *ఆంధ్రసచిత్ర వారపత్రిక, 2-12-88* ●

★ ★ ★